బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కోనాపూర్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి


బోర్లం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- గ్రామాల్లో కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం
- గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లకు వినతి

పెద్ద కొప్‌గల్/ గాంధారి/ రామారెడ్డి/బాన్సువాడ టౌన్/ బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్, మే 8: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృ ద్ధి సాధ్యమని పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంజని, చిన్న తక్కడ్‌పల్లి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీగా అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌దేశాయ్, రంజిత్‌సింగ్, సాయాగౌడ్, మహమూద్, కండేరావు, సంగప్ప తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేశారు. కారు గుర్తుకు ఓటేసి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఎండ తీవ్రంగా ఉండడంతో కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని 10, 13వ వార్డుల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సతీమణి సోనీ రెడ్డి ప్రచారం చేశారు. గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తుండడంతో ఆడబిడ్డలా బొట్టు పెట్టి ఇంట్లోకి ఆహ్వానించి శాలువాతో సన్మానం చేశారు. బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి ప్రతిమారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు , ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలంలోని బోర్లం, ఇబ్రహీంపేట్, దేశాయిపేట్, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, శ్రావణ్‌కుమార్, నాయకులు నారాయణరెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, సాయిలు యాదవ్, పర్వంరెడ్డి, ప్రశాంత్‌కుమార్, సయ్యద్ జలీల్, మన్నెచిన్న సాయిలు, హన్మాండ్లు, సత్యం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్, సంగోజీపేట్, హన్మాజీపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి గ్రామానికి వచ్చిన భాస్కర్‌రెడ్డికి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల ప్రచారంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాంనాయక్, నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, జెట్టి హన్మాండ్లు, సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, రాసాలం సాయిలు, భూషణం, కార్యకర్తలు పాల్గొన్నారు. బీర్కూర్‌లో బీఆర్ఎస్ నాయకులు గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సందీప్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శశికాంత్, కోఆప్షన్ సభ్యుడు ఆరిఫ్, గ్రామ అధ్యక్షుడు రాజు, నాయకులు గంగారాం, రఘు, రాజు, మన్నాన్, రాములు పాల్గొన్నారు.

బాన్సువాడలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి సతీమణి సోనీరెడ్డి

పెద్దకొడప్‌గల్ మండలం అంజని గ్రామంలో..

గుడిమేట్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి, మే 8 : జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో బీఎస్పీ భిక్కనూరు మండల అధ్యక్షుడు ద్యాగల నవీన్, గ్రామ అధ్యక్షుడు నర్సింగ్‌రావు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షుడు భాను ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్

రైస్ మిల్ యజమానులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి, మే 8 : అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్ యజమానులు అన్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో బుధవారం 29 మంది రా మిల్లుల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. లారీలు మిల్లులకు వచ్చిన వెంటనే రైస్‌మిల్ యజమానులు సామర్థ్యం మేరకు అన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ట్రక్ షీట్ జారీ చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ సజావుగా కొనసాగించాలని ఆదేశించారు. రైతుల ధాన్యం తడవకుండా రైస్ మిల్ యజమానులు తమ వంతు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జునబాబు, ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాంపూర్ తండాలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెక్టార్ అధికారి గంగాధర్

బాన్సువాడ రూరల్, మే 8 : మండలంలోని రాంపూర్ తండా, రాంపూర్, ఇబ్రహీంపేట్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి గంగాధర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఓటర్లకు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులు నవీన్, భాస్కర్, రాజు, సురేశ్, శ్రీధర్‌రెడ్డికి సూచించారు. నీడ, తాగునీటి సౌకర్యం, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 8: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి పోలింగ్ రోజు ముందు 48 గంటల నిశ్శబ్ద (సైలెన్స్ పీరియడ్) కాలం అత్యంత కీలకమని, అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. ఎన్నికల సంఘం స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్‌లో పేర్కొన్న విధంగా పోలింగ్‌కు 72 గంటలు, 48 గంటల ముందు తూచ తప్పక పాటించాల్సిన నిబంధనలను వివరించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, అబ్కారీ, వాణిజ్య పన్నులు, ఆదాయ పన్ను, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములు, వ్యయ నియంత్రణ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 13న సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియనుండగా అంతకుముందు 48 గంటల నుంచి ఎన్నిక ముగిసే వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. ఐదుగురికి మించి ఒకే చోట గుమిగూడరాదని తెలిపారు. 11, 12 తేదీల్లో రాత్రివేళలో ప్రత్యేక నిఘా పెట్టి సీ-విజిల్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఓటు గోప్యత దృష్ట్యా మీడియా ఫొటోలు తీయరాదని కోరారు.

వార సంత ప్రదేశం మార్పు

బాన్సువాడ టౌన్, మే 8 : పట్టణంలో నిర్వహించే వార సంత ప్రదేశంలో మార్పు చేస్తున్నట్లు బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత బాన్సువాడకు వెళ్లే దారిలో వార సంత నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని బాన్సువాడ పరిసర ప్రాంత ప్రజలు గమనించాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రచార రథం ఫ్లెక్సీ చించివేత

పోలీసులకు ఫిర్యాదు

బస్వాపూర్ శివారులో దుండగులు చించేసిన బీఆర్ఎస్ ప్రచార రథం ఫ్లెక్సీ

భిక్కనూరు, మే8 : మండలంలోని మల్లుపల్లి గ్రామం నుంచి నుండి బస్వాపూర్‌కు వస్తున్న క్రమంలో కొందరు దుండగులు బీఆర్ఎస్ ప్రచార రథం ఫ్లెక్సీని చించివేశారు. గులాబీ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఇతర పార్టీలకు చెందినవారు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెలి శ్రీనివాస్ అన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వడ్రంగి సంఘం ఏకగ్రీవ ఎన్నిక

బాన్సువాడ, మే 8 : బాన్సువాడలో వడ్రంగి వృత్తి సంఘం కమిటీని సంఘ సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వడ్రంగి సంఘం గౌరవ అధ్యక్షుడిగా గంట్యాల బాలకృష్ణ, అధ్యక్షుడిగా ఎస్‌డీ సర్ధార్, కార్యదర్శి పాంచల్ సంజీవ్, కోశాధికారిగా ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడిగా కొల్లూరు గంగాధర్ చారి, వడ్ల ప్రకాశ్ చారి, ఉప కార్యదర్శిగా నకాషి రవి, ముఖ్య సలహాదారులుగా గంట్యాల బాల్‌రాజ, గంగాధర్ మేస్త్రీ, దిగంబర్ మేస్త్రీ, రాములు చారి, పుండరి చారి, మల్లేశం చారి, లక్ష్మణ్ చారి, ఖయ్యూం, రాజు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మధు, శ్రీహరి, అమీర్, హన్మాండ్లు, మచ్చసంగమేశ్వర్, నర్సింహులు, సంతు, కుర్రి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయించాలి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి రూరల్, మే 8 : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో ఉం డడంతో మరమ్మతులు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ భవనం సమీపంలో మరుగుదొడ్డిని నిర్మించాలని సూచించారు. భవనం మరమ్మతు పనులకోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ సమీపంలో రెండు చెట్లు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు గాలివీచే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చెట్ల కొమ్మలు వెంటనే తొలగించాలని విద్యు త్ శాఖ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి బాలయ్య, పంచాయతీరాజ్ ఏఈ ఆదిత్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్త సురే ఖ, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం పనిచేస్తున్నా..'

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ఎల్లారెడ్డి, మే 8: తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజలతోనే ఉంటూ.. వారి కోసమే పని చేస్తున్నానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆయన బుధవారం నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో పర్యటించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని అమలు చేసిందన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బ్యాలెట్ ఓటింగ్ 10 వరకు పొడిగింపు

కామారెడ్డి/బాన్సువాడ/ఎల్లారెడ్డి, మే 8 : ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా భారత ఎన్నికల కమిషన్ ఈ నెల 10 వరకు అవకాశం కల్పించిందని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది బుధవారం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన 4,546 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 సమర్పించగా వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 10వ తేదీ శుక్రవారం వరకు పొడగించిందని తెలిపారు. కామారెడ్డి ఆర్డీవో, మద్నూర్, ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయాల్లో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంత వరకు ఓటు హక్కు వినియోగించుకొని ఉద్యోగులు వెంటనే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

వైభవంగా పాపమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

బిచ్కుంద, మే 8: మండల కేంద్రలో రజక సంఘం ఆధ్వర్యంలో పాపమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు కొనసాగాయి. మహిళలు బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వ్యాయామం చేయిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, మే 8: పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రతి బుధవారం దివ్యాంగ చిన్నారుల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్పీ వెంకటేశం అన్నారు. వేసవి సెలవుల్లో కూడా దివ్యాంగ చిన్నారుల కోసం ఫిజియోథెరపీ శిబిరాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నిర్వహించిన శిబిరంలో డాక్టర్ అరుణ్‌కుమార్ మొత్తం ఎనిమిది మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. శిబిరంలో ఐఈఆర్పీ శివకుమార్ అప్పా, దివ్యాంగ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
I, YAMUNA ALETI, W/O. ALETI LINGA REDDY R/O. H.NO.7-22/2/2, VELPUR, (D) NIZAMABAD, CHANGED MY NAME AS ALETI BALAMANI
NTZ-324803
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం

అభ్యర్థి గెలుపుపై కీలకం కానున్న అతివల తీర్పు

ఎల్లారెడ్డి, మే 8: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అభ్యర్థి గెలుపుపై వారి తీర్పు కీలకం కానున్నది. పురుషుల కంటే సుమారు తొమ్మిది వేల మంది మహిళా ఓటర్లు ఈ నియోజకవర్గంలో అధికంగా ఉన్నారు. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు మహిళల ఓట్లపై దృష్టి సారించారు. నియోజక వర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,23,306 కాగా వారిలో పురుషులు లక్షా ఏడు వేల 158 మంది. మహిళా ఓటర్లు లక్షా 16 వేల 146 మంది. నియోజక వర్గంలో పురుషుల కంటే మహిళలు 8,988 మంది ఎక్కువగా ఉన్నారు.

మండలాల వారీగా ఇలా..

గాంధారి మండలంలో పురుష ఓటర్లు 19,620 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 20,078మంది ఉన్నారు. సదాశివనగర్ మండలంలో పురుషులు 15,637, మహిళలు 16,925, రామారెడ్డి మండలంలో పురుషులు 7,644, మహిళలు 8,549. తాడ్వాయి మండలంలో పురుష ఓటర్లు 12,126 మంది ఉండగా మహిళా ఓటర్లు 13,569 మంది ఉన్నారు. రాజంపేట మండలంలో పురుష ఓటర్లు 6,136, మహిళ ఓటర్లు 6,527, లింగంపేట మండలంలో పురుషులు 18,015, మహిళలు 19,422, నాగిరెడ్డిపేట మండలంలో పురుషులు 11,830, మహిళలు 13,513, ఎల్లారెడ్డి మండలంలో పురుష ఓటర్లు 15,873 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 17,561 మంది ఉన్నారు. కాగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గంలో 270 పోలింగ్ కేంద్రాలు..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో మొత్తం 270 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. గాంధారి మండలంలో 46, సదాశివనగర్ మండలంలో 37, రామారెడ్డి మండలంలో 22, తాడ్వాయి మండలంలో 32, రాజంపేట మండలంలో 15, లింగంపేట మండలంలో 42, నాగిరెడ్డిపేట మండలంలో 32, ఎల్లారెడ్డి మండలంలో 44 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి.

సీఎం రేవంత్, అద్దంకి దిష్టిబొమ్మల దహనం

కామారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్/ బిచ్కుంద, మే 8: హిందువుల ఆరాధ్య దైవ్యం శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ స్వార్థ రాజకీయాల కోసం మతాల మధ్య చిచ్చు పెడుతూ హిందువులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, దయాకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి, కార్యదర్శి వంగ ప్రసాద్, బజరంగ్ దళ్ నాయకుడు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యంతో పోల్చి, కాంగ్రె స్ నాయకుడు అద్దంకి దయాకర్.. రాముడు, సీతపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. బిచ్కుందలోని బస్టాండ్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ బాలాజీ మాట్లాడుతూ.. అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. రాజేశ్ చారి, శ్రావణ్, ఆదిత్య, సాయిరాం, సాయిలు, సాయి, మహేశ్, పాల్గొన్నారు.

కామారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు

బిచ్కుందలో..

ఎల్లారెడ్డిలో ..